క్లుప్తంగా

ఉల్చాల సొసైటీకి ఆప్కాబ్ డైమండ్ జూబ్లీ అవార్డు



ఉల్చాల సొసైటీ చైర్మన్ వంశీకృష్ణారెడ్డికి అవార్డును అందజేస్తున్న ఎమ్మెల్యే సుధాకర్

కర్నూలు (న్యూటౌన్): ఉల్చాల వ్యవసాయ పరపతి సహకార సంఘానికి ఆప్కాబ్ డైమండ్ జూబ్లీ అవార్డు రావడం అభినందనీయమని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ అన్నారు. గురువారం తన నివాసంలో ఉల్చాల సొసైటీ చైర్మన్ వంశీకృష్ణారెడ్డికి ఆప్కాబ్ డైమండ్ జూబ్లీ అవార్డును, సర్టిఫికెట్‌ను ఎమ్మెల్యే అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధాకర్ మాట్లాడుతూ రైతులకు ఉత్తమ సేవలు అందించడంతోనే అవార్డు దక్కిందన్నారు.

నేడు 'గడప గడపకు మన ప్రభుత్వం'

కర్నూలు(న్యూటౌన్): మండల పరిధిలోని పడిదెంపాడులో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ అజాంఖాన్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గురువారం జరగాల్సిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం వర్షం వల్ల శుక్రవారానికి వాయిదా వేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో భాగంగా కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ ఇంటింటికి తిరిగి ప్రభుత్వ పథకాల గురించి ప్రజలకు వివరించి, సమస్యలు తెలుసుకుంటారన్నారు.

రైతులకు పూర్తి పరిహారం ఇవ్వాలి

కర్నూలు(సెంట్రల్): ఏపీఐఐసీ కోసం భూములిచ్చిన రైతులకు పూర్తి పరిహారం ఇవ్వాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణ డిమాండ్ చేశారు. గురువారం ఏపీ రైతుసంఘం ఆధ్వర్యంలో బాధిత రైతులతో కలిసి కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చేందుకు వచ్చారు. ఆమె అందుబాటులో లేకపోవడంతో కలెక్టరేట్ ఏఓకు అందించారు. ఓర్వకల్లు మండలం కొమరోలు దళితుల భూములను సేకరించిన ఏపీఐఐసీ పూర్తి పరిహారాన్ని ఇవ్వడంలేదని, ప్రభుత్వం స్పందించి న్యాయం చేయాలని కోరారు.

సంతాపం

కర్నూలు (న్యూటౌన్): మునగాలపాడు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త ప్రతాప్‌గౌడు (30) బుధవారం రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. విషయం తెలుసుకున్న కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ మునగాలపాడులోని ప్రతాప్‌గౌడు నివాసానికి చేరుకుని మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

పచ్చటి చెట్లతోనే జీవకోటి మనుగడ



పులకుర్తిలో మొక్క నాటుతున్న ఎంపీడీఓ చంద్రశేఖర్

కోడుమూరు రూరల్: పచ్చటి చెట్లతోనే భూమిపై జీవకోటి మనుగడ సాధ్యమవుతుందని ఎంపీడీఓ చంద్రశేఖర్ తెలిపారు. గురువారం మండలంలోని పులకుర్తి, కల్లపరి గ్రామాల్లో నాభూమి–నాదేశం కార్యక్రమాన్ని నిర్వహించి ఎస్‌ఐ శ్రీనివాసులు, ఉపాధి ఏపీడీ పద్మావతి, ఏపీఓ రమాదేవి, సచివాలయ సిబ్బంది, విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు.

వీరులకు వందనం

కర్నూలు (న్యూటౌన్): మాతృభూమి స్వాతంత్ర్య పరిరక్షణకు, అభ్యున్నతి కోసం ప్రాణ త్యాగం చేసిన వీరులందరికీ వందనమని నందనపల్లె గ్రామ సర్పంచ్ కె మాధురి అన్నారు. ఆజాదీకా అమృత్ మహోత్సవంలో భాగంగా గురువారం కర్నూలు మండలం నందనపల్లె గ్రామంలో మేరి మిట్టి – మేరా దేశ్ కార్యక్రమంలో భాగంగా వీరులకు వందనం అనే కార్యక్రమానికి నిర్వహించి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం 75 మొక్కలను గ్రామంలో నాటారు.కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్లు వెంకటేశ్వర్లు, అనిల్‌బాషా, ఎన్ఆర్ఈజీఎస్ టెక్నికల్ అసిస్టెంట్ పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

ధర్నాను విజయవంతం చేయండి

గడివేముల: ఈనెల 12న నంద్యాల తహసీల్దార్ కార్యాలయం వద్ద నిర్వహించనున్న 12 గంటల ధర్నాను విజయవంతం చేయాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి, ఫ్యాప్టో రాష్ట్ర నాయకులు నగిరి శ్రీనివాసులు, సీనియర్ నాయకులు బి.రామపుల్లారెడ్డి ఉపాధ్యాయులను కోరారు. గురువారం గడిగరేవుల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ధర్నాకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రాథమిక విద్యకు గొడ్డలి పెట్టులాంటి 117 జీఓను రద్దు చేయాలని, సీపీఎస్‌ను రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, కొందరు ఉపాధ్యాయులకు రెండు నెలలుగా పెండింగ్‌లో ఉన్న జీతాలను విడుదల చేయాలని, విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి కక్ష సాధింపు చర్యలు మానుకోవాలని, యాప్స్‌తో పాటు బోధనేతర పనుల నుంచి విముక్తి కలిగించాలనే తదితరర డిమాండ్ల పరిష్కారానికి చేపట్టనున్న ధర్నాకు ఉపాధ్యాయులు తరలిరావాలన్నారు.

ముగిసిన నామినేషన్ల పర్వం

- దివరిరోజు భారీగా నామినేషన్ల దాఖలు
- రేపు నామినేషన్ల పరిశీలన
- 19న ఎన్నికలు





గోరంట్లలో వార్డు మెంబర్ స్థానానికి నామినేషన్ దాఖలు చేస్తున్న లాలెమ్మ, కొండజూటూరులో నామినేషన్ పత్రాలు ఆర్ఓ మధుశేఖర్‌కు అందజేస్తున్న, రాచమల్లు అపర్ణ

కోడుమూరు : గ్రామ పంచాయతీల పరిధిలో ఖాళీ ఏర్పడిన వార్డు మెంబర్ స్థానాలకు నామినేషన్ల పర్వం గురువారంతో ముగిసింది. మండలంలోని గోరంట్ల 6వ వార్డుకు 3 నామినేషన్లు, ప్యాలకుర్తి 6వ వార్డు మెంబర్ స్థానానికి 2 నామినేషన్లు దాఖలైనట్లు ఆయా గ్రామ పంచాయతీల ఎన్నికల అధికారులు పీఆర్ ఏఈ గంగరాజు, ఈఓఆర్డీ మంజుల తెలిపారు. అలాగే ఎన్నికల్లో భాగంగా 11వ తేదీ శుక్రవారం నామినేషన్ల పరిశీలన, 14న నామినేషన్ల విత్ డ్రా, 19వ తేదీ ఉదయం ఎన్నికలు, మధ్యాహ్నం కౌంటింగ్ నిర్వహించడం జరుగుతుందని గంగరాజు వెల్లడించారు.

ప్రశాంతంగా ముగిసిన నామినేషన్ల ఘట్టం

ఓర్వకల్లు : వార్డు సభ్యుల ఉప ఎన్నికలకు సంబంధించి గురువారం నామినేషన్ల ఘట్టం ప్రశాంతంగా ముగిసింది. మండలంలోని ఓర్వకల్లు, తిప్పాయపల్లె, బ్రాహ్మణపల్లె, శకునాల, చింతలపల్లె గ్రామాలలో ఖాళీ ఏర్పడిన ఐదు వార్డు సభ్యులకు గాను మొత్తం 17 నామినేషన్లు దాఖలైనట్లు ఎంపీడీఓ శివనాగప్రసాద్ తెలిపారు. ఇందులో భాగంగా కేతవరం, చింతలపల్లె గ్రామాల వార్డు సభ్యుల స్థానాలకు వైఎస్సార్‌సీపీ బలపరచిన అభ్యర్థులు ఒక్కొక్క నామినేషన్ చొప్పున దాఖలు చేయడంతో ఈ రెండు స్థానాలు దాదాపుగా ఏకగ్రీవమైనట్లు ఆయన తెలిపారు. మిగతా గ్రామాలైన ఓర్వకల్లు– 6, శకునాల–7, బ్రాహ్మణపల్లె–2 చొప్పున నామినేషన్లు వేసినట్లు వెల్లడించారు.కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు రంగనాథ్‌గౌడు, సింగిల్ విండో చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి, నాయకులు శంకర్‌రెడ్డి, మద్దిలేటి,రమణారెడ్డి, ఎల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

గడివేముల: మండల పరిధిలోని దుర్వేసి గ్రామంలో ఖాళీగా ఉన్న 9వ వార్డుకు గురువారం నామినేషన్లు ముగిసినట్లు ఎన్నికల అధికారి అబ్దుల్ ఖాలిక్ తెలిపారు. రెండు నామినేషన్లు వచ్చినట్లు ఆయన తెలిపారు.

నాలుగు వార్డు స్థానాలకు ఏడు నామినేషన్లు

కర్నూలు (న్యూటౌన్): కర్నూలు మండల పరిధిలోని ఆర్‌కే దుద్యాల, ఉల్చాల, జి శింగవరం, దిగువపాడు గ్రామాలకు సంబంధించి నాలుగు వార్డు స్థానాలకు ఏడు మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయడంతో నామినేషన్ల ప్రక్రియ ప్రశాంతంగా ముగిసినట్లు కర్నూలు మండల ఎంపీడీఓ, అసిస్టెంట్ ఎలక్షన్ ఆఫీసర్ అజాంఖాన్ స్పష్టం చేశారు. మండల పరిధిలోని ఉల్చాల గ్రామంలో 11వ వార్డుకు నిడ్జూరు చిన్న నాగరాజు, బోయ మద్దిలేటి, రాజోలి రాధాకృష్ణమ్మ నామినేషన్లు దాఖలు చేశారని ఆయన తెలిపారు. అలాగే దిగువపాడు గ్రామంలో 8వ వార్డుకు వడ్డె వెంకటలక్ష్మమ్మ, వి హనుమంతు నామినేషన్లు దాఖలు చేశారన్నారు. జి సింగవరంలో 2వ వార్డుకు కె రాణి, ఆర్‌కే దుద్యాల గ్రామంలో 4వ వార్డుకు బోయ ఎల్లప్ప నామినేషన్లు వేశారని వివరించారు. ఆయా గ్రామాల్లో స్టేజ్1 అధికారులుగా నాగేశ్వర్‌రెడ్డి, రవి మోహన్‌రెడ్డి, రంగస్వామి, వినోద్‌కుమార్ వ్యవహరిస్తున్నారన్నారు.

పర్ల 5, 12 వార్డులకు ఒక్కొక్కరు..

కల్లూరు: మండల పరిధిలోని పర్ల గ్రామ పంచాయతీలో 5వ, 12వ వార్డులకు, ఉలిందకొండ గ్రామ పంచాయతీలో 3వ వార్డుకు ఉప ఎన్నికలు జరగనున్నాయి. పర్ల–5వ వార్డుకు, పర్ల–12వ వార్డుకు ఒకొక్కరు, ఉలిందకొండ 3వ వార్డుకు ఆరు మంది నామినేషన్లు వేసినట్లు ఎంపీడీఓ(అసిస్టెంట్ ఎలక్షన్ ఆఫీసర్) జీవీ రమణమూర్తి తెలిపారు. గురువారం నాటికి పర్ల 5వ వార్డుకు పి.శేఖర్, 12వ వార్డుకు బి.మహనంది నామినేషన్లు వేసినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి(ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ) శ్రీనాథ్ వెల్లడించారు. ఉలిందకొండ గ్రామ పంచాయతీ 3వ వార్డుకు బాలమద్ది, కరుణాకర్, జి.లక్ష్మిదేవి, వి.రాజశేఖర్, వి.రాముడు, ఎం.లింగన్న నామినేషన్లు దాఖలు చేసినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి(పీఆర్ ఏఈ) అచ్యుతానందరెడ్డి తెలిపారు.

కొండజూటూరు 1వ వార్డు మెంబర్ ఎన్నిక ఏకగ్రీవ్రం

పాణ్యం : మండల పరిధిలోని కొండజూటూరు 1వ వార్డు సభ్యుడు అనారోగ్యంతో చనిపోవడంతో ఉపఎన్నిక అనివార్యమైంది. ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల కావడంతో ఈ వార్డు నుంచి పోటీ చేసేందుకు అభ్యర్థులు ముందుకు రాలేదు. దీంతో వైఎస్సార్‌సీపీ బలపరిచిన రాచమల్లు అపర్ణ ఒక్కరే నామినేషన్ వేశారు. దీంతో ఎన్నిక ఏకగ్రీవమైంది. ఉదయం సచివాలయం వద్ద నామినేషన్ వేసేందుకు అభ్యర్థితో పాటు జెట్పీటీసీ సద్దల సరళమ్మ, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సద్దల సూర్యానారాయణరెడ్డి, సర్పంచ్ సద్దల సుజిత్‌రెడ్డితో పాటు వైఎస్సార్‌సీపీ నాయకులు వెంట వెళ్లారు. సాయంత్రం వరకు కేవలం ఒకే ఒక్క నామినేషన్ రావడంతో ఎన్నిక ఏకగ్రీవం అయ్యింది. అధికారిక ప్రకటన ఇక లాంఛనమే. దీంతో పలువురు ప్రజాప్రతినిధులు అపర్ణకు శుభాకాంక్షలు తెలిపారు.

అన్ని వర్గాలకు సంక్షేమ ఫలాలు

- ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి



వర్షంలోనే మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

గడివేముల: అన్ని వర్గాలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమ ఫలాలు అందేలా పాలన సాగిస్తున్నారని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి అన్నారు. గురువారం గడివేముల సచివాలయం–1 పరిధిలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి ప్రజలను ఆప్యాయంగా పలకరించి, పథకాలు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. నాలుగేళ్లలో ప్రభుత్వం ద్వారా పొందిన లబ్ధిని వివరించి సంక్షేమ క్యాలెండర్‌ను అందజేశారు. ఇంకా ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకోరావాలని సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాంభూపాల్‌రెడ్డి మాట్లాడుతూ కుల, మత, రాజకీయాలకు అతీతంగా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందజేస్తున్నామన్నారు. ఎన్నికల హామీలను 95 శాతం నెరవేర్చిన ముఖ్యమంత్రి జగన్నను మరోసారి ఆదరించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు ఆర్‌బీ చంద్రశేఖరరెడ్డి, ఎంపీపీ నాగమద్దమ్మ, ఉప సర్పంచ్ బాలచెన్ని, తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీఓ శివమల్లేశ్వరప్ప, జిల్లా వ్యవసాయ కమిటీ చైర్మన్ శిరుప శ్రీనివాసరెడ్డి, హౌసింగ్ ఏఈ మూర్తి, సింగిల్ విండో చైర్మన్ పోగుల చంద్రశేఖర రెడ్డి, ఎంపీటీసీ వంగాల మహేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు

ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా పనిచేయండి

- రైతులను, ప్రజలను కార్యాలయాల చుట్టూ తిప్పుకోవద్దు
- మండల సర్వసభ్య సమావేశంలో పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

గడివేముల: పేదల సంక్షేమం, అభివృద్ధి కోసం నిరంతరం శ్రమిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆశయాలకు అనుగుణంగా ప్రతి అధికారి పనిచేసి ప్రభుత్వానికి మంచిపేరు తీసుకురావాలని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి సూచించారు. గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముందుగా అధికారుల తమ శాకల ప్రగతి నివేదికలను చదివి వ వినిపించారు. మంచాలకట్ట గ్రామం వద్ద మద్దిలేరుకు తూము ఏర్పాటు చేయాలని, శ్మశాన వాటికకు స్థలం కేటాయించాలని ఎంపీటీసీ వంగాల మహేశ్వరరెడ్డి కోరగా.. ఆ దిశగా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. అనంతరం కాటసాని రాంభూపాల్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకం అందేలా చూడాలని అధికారులకు సూచించారు. ఏదైనా పని నిమిత్తం కార్యాలయాలకు వచ్చే ప్రజలను పదేపదే తిప్పుకోకుండా వీలైనంత త్వరలో పరిష్కరించి పంపాలన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యుడు ఆర్‌బీ చంద్రశేఖరరెడ్డి, ఎంపీపీ నాగమద్దమ్మ,వె వైస్ ఎంపీపీ కాలునాయక్, సర్పంచులు రాములమ్మ, రామ్మోహన్ రెడ్డి, మాలిక్‌బాషా, మండ్ల మమత, అంజనమ్మ, ఎంపీటీసీలు తలారి మద్దమ్మ, శ్రీనివాసరెడ్డి, తహసీల్దార్ శ్రీనివాసులు, ఏపీఎం హజరత్, ఏఈలు భాస్కర్, పవన్‌కుమార్, ఏపీఓ వెంకటరమణ, ఎంఈఓ–2 విమలా వసుంధరదేవి, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మొల్లా జబీన్, పశువైద్యాధికారులు నవీన్, సాయిహరిణి, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు పాల్గొన్నారు.

చంద్రబాబు అరాచకాలను ఎండగట్టాలి



చంద్రబాబు దిష్టిబొమ్మను దహనం చేస్తున్న దృశ్యం

ఓర్వకల్లు: టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడి అరాచకాలను ఎండగట్టాలని ఎంపీపీ తిప్పన్న పిలుపునిచ్చారు. గురువారం మండలంలోని హుసేనాపురం గ్రామంలోని సంత మార్కెట్‌లో చంద్రబాబు దౌర్జన్యకాండకు నిరసనగా వైఎస్సార్‌సీపీ నాయకులు ఆయన దిష్టిబొమ్మను దహనం చేశారు. వారు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రజలు ప్రశాంతంగా జీవిస్తున్న తరుణంలో చంద్రబాబు వివిధ కార్యక్రమాల ముసుగులో బీభత్సాలు సృష్టించి ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని విమర్శించారు. పుంగనూరు సంఘటనలో బాబు కీలక పాత్ర పోషించి అల్లర్లకు పాల్పడితే, ఎల్లో మీడియాలు వక్రీకరించి దుష్ప్రచారాలు చేయ డం శోచనీయమన్నారు. అందుకు చంద్రబాబుపై తక్షనమే 420 కేసు నమోదు చేయాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు రంగనాథ్‌గౌడు, సింగిల్ విండో చైర్మన్ నాగతిరుపాలు, స్థానిక నాయకులు జీకే వెంగన్న, లోటర్ బాష, గుర్రాల చెన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కోడుమూరులో 44.2 మి.మీ వర్షపాతం



కోడుమూరులో బోరుబావి కింద వరినాట్లు వేస్తున్న కూలీలు

కోడుమూరు రూరల్: కోడుమూరులో బుధవారం సాయంత్రం నుంచి గురువారం ఉదయం వరకు కురిసిన వర్షం 44.2 మి.మీగా నమోదైంది. రెండు వారాల క్రిందట కురిసిన వర్షాలతో మండలంలో ఖరీఫ్ కింద రైతులు జోరుగా పంటలను సాగు చేశారు. ప్రస్తుతం భారీ వర్షం కురవడంతో సాగు చేసిన పంటలతో పాటు, ముంగారు పంటలకు కూడా ఎంతో మేలు చేకూరుతుందని రైతులు చెబుతున్నారు. ముఖ్యంగా వర్షాధారంగా సాగు చేసిన ఉల్లి పంటకు ప్రస్తుతం కురిసిన వర్షం జీవం పోసిందని ఆనందం వ్యక్తం చేశారు. భారీ వర్షంతో మండలంలోని కోడుమూరు, వర్కూరు, గోరంట్ల, లద్దగిరి, అల్లినగరం గ్రామాల్లో బోరుబావులు, హంద్రీనది వెంట రైతులు జోరుగా వరినాట్లు వేస్తున్నారు.

రైతులు భూమి నిజ నిర్ధారణ చేసుకోవాలి



సంగాలలో భూ రీ సర్వేపై సూచనలు చేస్తున్న ఆర్డీఓ హరిప్రసాద్

సి.బెళగల్: జగనన్న శాశ్వత భూ హక్కు – భూ రక్ష పథకం నిర్వహణలో భాగంగా మొదటిదశ రీ సర్వే పనులు పూర్తి అయిన గ్రామాలలో గ్రామసభలను నిర్వహించడం జరుగుతుందని, రైతులు హాజరై, తమ భూమి నిజ నిర్ధారణను చేసుకోవాలని కర్నూలు ఆర్డీఓ హరిప్రసాద్ సూచించారు. గురువారం మండలంలోని పలుకుదొడ్డి రెవెన్యూ పరిధిలోని సంగాల గ్రామంలో భూమి నిజ నిర్ధారణపై గ్రామ సర్పంచ్ హనుమంతు అధ్యక్షతన తహసీల్దార్ శేషఫణి, డిప్యూటీ తహసీల్దార్ కృష్ణమూర్తి గ్రామసభను నిర్వహించారు. గ్రామసభను ఆర్డీఓ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ.. మండల రైతులు, ప్రజలు భూముల రీ సర్వేను సద్వినియోగం చేసుకోవాలన్నారు. సర్వేతో స్థలాలకు సమస్యలు లేకుండా ఉంటుందని, ఇందుకు రైతులు సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన సర్వే అంశాలపై రెవెన్యూ అధికారులకు సూచనలిచ్చారు. కాగా పలుకుదొడ్డి రెవెన్యూ పరిధిలోని 2,534 మందికి చెందిన 3,800 ఎకరాల విస్తీర్ణం ఉన్న భూమిని రీ సర్వే మొదటి దశ పూర్తి అయిందని తహసీల్దార్ తెలిపారు. భూములు సర్వే పూర్తి అయిన రైతులు నిర్ధారణకు 9(2) నోటీస్‌లను సర్వే సిబ్బందికి అందజేయాలని డీటీ సూచించారు.

రీ సర్వేతో రైతులకు ప్రయోజనం

కర్నూలు (న్యూటౌన్): భూముల రీ సర్వేతో రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని, సర్వే పూర్తయిన తర్వాతకు గ్రామాల్లో డిజిటల్ రికార్డులను సిద్ధం చేస్తామని కర్నూలు రూరల్ తహసీల్దార్ ఆర్ శివరాముడు అన్నారు. గురువారం కర్నూలు మండలం నూతనపల్లె గ్రామంలో రైతులతో గ్రామ సభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ భూముల రీ సర్వేతో రైతుల మధ్య నెలకొన్న సమస్యలు పూర్తిగా పరిష్కారమవుతాయన్నారు. కార్యక్రమంలో పీఓఎల్ఆర్ డీటీ శారద, మండల సర్వేయర్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత జీవనం గడపాలి



ప్రజలతో మాట్లాడుతున్న డీఎస్పీ విజయశేఖర్

సి.బెళగల్: ఫ్యాక్షన్ గ్రామాలలో ప్రజలు గొడవులకు తావు లేకుండ ప్రశాంతంగా జీవించాలని కర్నూలు డీఎస్పీ విజయశేఖర్ అన్నారు. గురువారం రాత్రి ఆయన సి.బెళగల్ మండల పరిధిలోని ఫ్యాక్షన్ గ్రామమైన పోలకల్‌ను కోడుమూరు సీఐ శ్రీధర్‌తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా శ్రీ చెన్న సోమేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో గ్రామస్తులతో ఏర్పాటు చేసిన సమావేశంలో డీఎస్పీ రక్షణ చట్టాలు, శిక్షలను ప్రజలకు తెలియజేశారు. ఆయన మాట్లాడుతూ.. ప్రజలు పాత పద్ధతులు మానుకోవాలని, ప్రభుత్వ వనరులు, సౌకర్యాలతో గ్రామాలలో గౌరవప్రద ప్రశాంత జీవనం సాగించాలన్నారు. పిల్లలను చదివించుకుని వారికి బంగారు భవిష్యత్ ఇవ్వాలని సూచించారు. అంతకు ముందు డీఎస్పీ సి.బెళగల్ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఎస్ఐ పీరయ్యను అడిగి కేసుల వివరాలు తెలుసుకున్నారు.

'సుంకేసుల'లో 1.026 టీఎంసీల నీరు నిల్వ



సుంకేసుల జలాశయం

గూడూరు: సుంకేసుల జలాశయంలో 1.026 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు డ్యాం అధికారులు గురువారం తెలిపారు. ఇన్ ఫ్లో నిలిచి పోయిందని, కర్నూలు ప్రజల తాగు నీటి అవసరాల కోసం 130 క్యూసెక్కుల నీటిని విడుదల చేశామన్నారు.

ఫీవర్ సర్వే త్వరగా పూర్తి చేయండి

ఓర్వకల్లు: వైద్య ఆరోగ్య సిబ్బంది గ్రామాలలో చేపడుతున్న ఫీవర్ సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలని డివిజనల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్(డీడీఓ) బాలకృష్ణారెడ్డి సూచించారు. గురువారం మండలంలోని ఉయ్యాలవాడ, లొద్దిపల్లె, నన్నూరు గ్రామ సచివాలయాలను సందర్శించారు. ఆయన మాట్లాడుతూ.. గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ సర్వే తప్పులు లేకుండా చేసి, 5–18 ఏళ్ల వయస్సు గల బడి బయటి పిల్లలను బడిలో చేర్పించాలని సూచించారు. గ్రామాలలో పర్యటించి సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.

పంటకోత ప్రయోగంపై అవగాహన

ఓర్వకల్లు : పంట కోత ప్రయోగంపై రైతులకు అవగాహన కల్పించాలని డివిజనల్ గణాంకాల అధికారి భాస్కర్ అన్నారు. బుధవారం స్థానిక రైతు భరోసా కేంద్రంలో నిర్వహించిన ఒక్క రోజు శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. పంట కోత ప్రయోగం ద్వారా పంట దిగుబడులను ముందుగానే అంచనా వేయవచ్చన్నారు. మండలంలో ర్యాండంగా సర్వే నంబర్లను ఎంపిక చేసుకొని అందులో 5 ఇంటు 5 అడుగుల విస్తీర్ణంలో పంట కోత చేపట్టి దిగుబడి అంచనా వేయాలన్నారు. కార్యక్రమంలో ఏఓ సుధాకర్, ఎస్ఓ సరళ, శివన్న తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

కల్లూరు: బస్తిపాడు వద్ద హంద్రీనది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను ఉలిందకొండ పోలీసులు పట్టుకున్నారు. ఉలిందకొండ ఎస్ఐ నల్లప్ప తెలిపిన వివరాలు.. సమాచారం మేరకు చిన్నటేకూరు ఆంజనేయ స్వామి దేవాలయం వద్ద బస్తిపాడు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకుని సీజ్ చేశారు. డ్రైవర్‌ను విచారించగా బస్తిపాడు గ్రామానికి చెందిన రంగస్వామిగా పోలీసులు గుర్తించారు.

నేడు శకునాలలో ఉచిత ఎక్స్‌రే శిబిరం

ఓర్వకల్లు: మండలంలోని శకునాల గ్రామంలో క్షయ వ్యాధి లక్షణాల వారికి ఉచితంగా ఎక్స్‌రే పరీక్షలు నిర్వహిస్తున్నట్లు క్షయవ్యాధి యూనిట్ సూపర్‌వైజర్ ఉపేంద్ర తెలిపారు. సేవాభారతి అధ్యక్షుడు, ప్రముఖ క్షయవ్యాధి వైద్యనిపుణులు డాక్టర్ శ్రీనివాసరెడ్డి సౌజన్యంతో మొబైల్ ఎక్స్‌రే వాహనాన్ని అందుబాటులో ఉంచుతున్నట్లు తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఎక్స్‌రే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఓటరు నమోదును పకడ్బందీగా చేపట్టాలి



సి.బెళగల్‌లో బీఎల్వోలకు అవగాహన కల్పిస్తున్న ఆర్డీఓ హరిప్రసాద్

సి.బెళగల్: గ్రామాలలోని బీఎల్వోలు కొత్త ఓటరు నమోదును పకడ్బందీగా చేపట్టాలని కర్నూలు ఆర్డీఓ హరిప్రసాద్ అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో తహసీల్దార్ శేషఫణి, డీటీ కృష్ణమూర్తి ఓటరు నమోదు, ఎన్నికల అంశాలపై మండలంలోని 49 మంది బీఎల్వోలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆర్డీఓ గ్రామాలలో ఓటరు సర్వే నిర్వహణ, నమోదులో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అదేవిధంగా ప్రజలు, రాజకీయ పార్టీ నాయకుల నుంచి వచ్చే ఫిర్యాదులపై సమగ్రంగా విచారించాలి, నివేదికలను అధికారులకు అందించే బాధ్యతను బీఎల్వోలు సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఫారం –6, 6ఏ, 7, 8లపై నిర్వహణపై ఎలక్షన్ డీటీ ప్రవీన్‌కుమార్ వివరించారు. సమావేశంలో ఈఓఆర్డీ సందీప్, ఎంఈఓ ఆదామ్‌బాషా పాల్గొన్నారు.

తప్పులు లేని ఓటరు జాబితా తయారు చేయండి

గూడూరు: తప్పులు లేని ఓటరు జాబితా తయారు చేయాలని కర్నూలు ఆర్డీఓ హరిప్రసాద్ అన్నారు. గురువారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ శివశంకర్ నాయక్ అధ్యక్షతన బీఎల్ఓలకు ఓటరు జాబితా సవరణ కార్యక్రమంపై ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ మాధవీలత, ఎన్నికల డీటీ ప్రవీణ్ కుమార్ , ఉన్నారు.

సర్వేను 20లోపు పూర్తి చేయండి

కోడుమూరు రూరల్: ఇంటింటి సర్వేను ఈనెల 20లోగా పూర్తి చేసి అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో ఉండేలా జాబితా రూపొందించాలని కర్నూలు ఆర్డీఓ హరిప్రసాద్ బీఎల్ఓలను ఆదేశించారు. గురువారం కోడుమూరు తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన బీఎల్ఓల సమావేశం నిర్వహించారు. సమావేశంలో కోడుమూరు తహసీల్దార్ జయన్న, ఎన్నికల డీటీ ప్రవీణ్‌కుమార్, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

విద్యార్థుల చదువులపై శ్రద్ధ వహించాలి



బ్యాతోలి పాఠశాలలో మాట్లాడుతున్న హెచ్‌ఎం సోమశేఖర్

సి.బెళగల్: విద్యార్థుల చదువులపై తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలని బ్యాతోలి పాఠశాల హెచ్‌ఎం సోమశేఖర్ అన్నారు. గురువారం పాఠశాల నిర్వహణ కమిటీ (పీఎంసీ) సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. పిల్లలను పాఠశాలలకు క్రమం తప్పకుండా పంపాలని, ఇళ్ల వద్ద విద్యార్థుల చదువులపై పర్యవేక్షణ చేయాలన్నారు. ప్రభుత్వ విద్యా పథకాలను సద్వినియోగం చేసుకుని బాలల విద్యాభివృద్ధికి పాటుపడాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు రమాకేశవప్రసాద్ ఉన్నారు. అదేవిధంగా ఆయా గ్రామాలో పీఎంసీ సభ్యులతో పాఠశాలలో హెచ్‌ఎంలు సమావేశాలను నిర్వహించారు.

నులిపురుగులను నులిమేద్దాం



గార్గేయపురంలో హెచ్‌ఎంకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేస్తున్న డాక్టర్ ప్రవీణ్‌కుమార్

కర్నూలు (న్యూటౌన్): చిన్నపిల్లల్లో వచ్చే చాలా అనారోగ్య సమస్యలకు మూలం నులిపురుగుగేనని.. ఆల్‌బెండోజోల్ మాత్రలతో నులిపురుగులను నులిమేద్దామని జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ ప్రవీణ్‌కుమార్ పిలుపునిచ్చారు. గురువారం కర్నూలు మండలం గార్గేయపురం పీహెచ్‌సీలో జరుగుతున్న నులిపురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా 1–19 సంవత్సరాలు కలిగిన పిల్లలందరూ ఆల్‌బెండోజోల్ మాత్రలు తప్పని సరిగా వేసుకోవాలని, ఎలాంటి ప్రమాదం ఉండదని స్పష్టం చేశారు. పిల్లల్లో శారీరక మానసిక ఎదుగుదల పెరుగుదలతో పాటు రక్తహీనత నియంత్రిస్తుందన్నారు. అనంతరం గర్భిణులు ఆరోగ్య పరిస్థితులను పరీక్షించి ఐరన్, క్యాల్షియం మాత్రలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ జయలక్ష్మి, డిస్ట్రిక్ కమ్యూనిటీ మొబలైజర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రల పంపిణీ

కల్లూరు: అంతర్జాతీయ నులిపురుగు నివారణ దినోత్సవం సందర్భంగా విద్యార్థుల ఆరోగ్యవంతంగా ఉండేందుకు ఆల్బెండజోల్ మాత్రలు వేస్తున్నామని మండల విద్యాశాఖ అధికారి శ్రీనివాసులు తెలిపారు. గురువారం కల్లూరు అర్బన్ పరిధిలోని శరీన్‌నగర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనం అనంతరం పాఠశాల విద్యార్థులు ఆల్బెండజోల్ మాత్రలు మింగించారు.

పాణ్యం : మండలంలో ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ విజయవంతంగా ముగిసిందని మద్దూరు పీహెచ్‌సీ డాక్టర్ సునీత తెలిపారు. ఒక్క రోజే 12,455 మంది విద్యార్థులకు మాత్రలు అందిచామన్నారు. మాత్రలు తీసుకున్న తర్వాత వారిని అరగంట సేపు పర్యవేక్షణలో ఉంచినట్లు తెలిపారు.

సి.బెళగల్: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏఎన్ఎం పుష్పలత నులిపురుగు నివారణ కార్యక్రమాన్ని నిర్వహించాగా.. ముఖ్య అతిథులుగా సర్పంచ్ పాండురంగన్న, హెల్త్ ఎడ్యుకేటర్ ఆదినారాయణ హాజరై విద్యార్థులకు ఆరోగ్య అంశాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. అదేవిధంగా సి.బెళగల్ అంగన్‌వాడీ కేంద్రం – 6లో హెల్త్ సూపర్‌వైజర్ మంగమ్మ బాలలకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు.

గూడూరు: మండలంలో గురువారం పాఠశాలల విద్యార్థులకు నులి పురుగు నివారణ మందులు పంపిణీ చేశారు. విద్యార్థులలో రక్త హీనత జబ్బు నివారణ కోసం ఈ మందులు ఇచ్చినట్లు ఎంఈఓ–2 నాగరాజు తెలిపారు.